క్లుప్తంగా

ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

కాశీబుగ్గ: ప్రతీ శుక్రవారం కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక(గ్రీవెన్స్) ఈ నెల 10వ తేదీ శుక్రవారం రద్దు చేస్తున్నట్లు పోలీసు ఉన్నత అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా కేంద్రంలో పోలీసు కానిస్టేబుల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్న కారణంగా హాజరు కాలేకపోతున్నట్లు జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

టెక్కలి: టెక్కలి విద్యుత్ శాఖ ఏఈగా దాసరి మురళీమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కార్యాలయ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. ఇప్పటివరకు ఏఈగా పనిచేసిన టి.ఈశ్వరరావు విజిలెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం

సోంపేట: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అన్నారు. పలాసపురం గ్రామంలో బుధవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. అనంతరం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం


అగ్ని కీలలకు దగ్ధమవుతున్న లక్ష్మమ్మ ఇల్లు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని లొద్దపుట్టి కొత్తవీధిలో పూరిల్లు దగ్ధమవ్వడంతో గ్రామస్తులు భయకంపితులయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక కొత్తవీధిలో పూరింట్లో నివాసం ఉంటున్న ఒంటరి మహిళా బరింద లక్ష్మమ్మ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామస్తులు అప్రమత్తం అయ్యారు. గాయాలపాలైన లక్ష్మమ్మను సురక్షిత ప్రాంతానికి చేర్చిన గ్రామస్తులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందివ్వడంతో చుట్టుపక్కల ప్రమాదం తప్పింది. సుమారు రెండున్నర లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఒంటరి మహిళను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి


మృతి చెందిన తిరుపతిరావు

టెక్కలి రూరల్: మండలంలోని చల్లపేట గ్రామానికి చెందిన సీహెచ్ తిరుపతిరావు అనే వ్యక్తి గురువారం గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతిరావు తన ఇంట్లో ఎవరు లేని సమయంలో పొలానికి వాడే గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న తిరుపతిరావుని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించే క్రమంలో ఆస్పత్రిలోనే మృతి చెందాడు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. అయితే తిరుపతిరావు ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. మృతుడికి భార్య భానుమతి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం ఉన్నత పాఠశాలలో 1989–90లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటి విద్యార్థికి అండగా నిలిచారు. కణితివూరు గ్రామానికి చెందిన తోటి విద్యార్థిని పార్వతికి చెందిన రెండు ఎకరాల వరిచేను కుప్పలు ఇటీవల దగ్ధమవ్వడంతో రూ.2 లక్షల వరకు నష్టం వచ్చింది. దీంతో ఆమెను పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తోటి మిత్రులు ఎల్.సరిత, నిర్మల, ద్రౌపది, మద్దిల హరినారాయణ, పి.రమేష్, బి.మోహనరావు, లోకనాథం, కృష్ణ, ఢిల్లీరావు, మధు, అప్పల స్వామి, మోహనరావు, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.



పేదలపై పక్షపాతం

- వైఎస్సార్, జగనన్న కాలనీల్లో కానరాని పల్లె పండగ
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

టెక్కలి:

రాష్ట్రంలో ఇళ్ల లేని పేద, సామాన్య వర్గాలు ఉండకూడదనే లక్ష్యంతో గత ప్రభుత్వంలో వైఎస్సార్, జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఆయా కాలనీల్లో గ్రావెల్ రోడ్లు, విద్యుత్ సదుపాయం, మంచినీటి సదుపాయం తదితర మౌలిక వసతులు కల్పించారు. ఈ క్రమంలో ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం అధికారం దక్కించుకోవడం జరిగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల పల్లె పండగ పేరుతో సిమెంట్ రోడ్లు, మురుగు నీటి కాలువల నిర్మాణాలు చేపడుతున్నారు. పల్లె పండగ పేరుతో కూటమి నాయకులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్లపై రోడ్లు వేసుకుని బిల్లులు చేసుకుంటున్నారు. అయితే పేద, సామాన్య వర్గాలకు గత


టెక్కలి మండలం అక్కవరం గ్రామంలో సిమెంట్ రోడ్డుపై సిమెంట్ రోడ్డు వేసిన దృశ్యం


నౌపడ జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రభుత్వం అందజేసిన వైఎస్సార్ జగనన్న కాలనీలపై మాత్రం వివక్ష చూపుతున్నారు. ఆయా కాలనీల్లో ఎక్కడా సిమెంట్ రోడ్లు, మురుగు నీటి కాలువల నిర్మాణాలు చేపట్టడం లేదు. కూటమి నాయకులకు వంత పాడుతూ అధికారులు రోడ్లపై రోడ్లు వేయిస్తున్నారు తప్పా, అవసరమైన చోట రోడ్లు వేయడం లేదంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కానరాని పల్లె పండగ

ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పల్లె పండగ పేరుతో సంక్రాంతిలోగా రోడ్లు పూర్తి చేయాలనే ఆత్రుతతో ఇష్టారాజ్యంగా రోడ్లు వేస్తున్నారు. అయితే జగనన్న కాలనీల్లో మాత్రం సిమెంట్ రోడ్ల నిర్మాణం చేయకపోవడంపై విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

- టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి మండలంలో 202 పనులకు గాను రూ.1,534.61 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఇదే మండలంలో 24 జగనన్న కాలనీలో ఉన్నాయి. అందులో సుమారు 1,027 మందికి పట్టాలు ఇచ్చారు. ఆయా కాలనీల్లో ఎక్కడా సిమెంట్ రోడ్లు వేస్తున్న దాఖలాలు లేవు.
- కోటబొమ్మాళి మండలంలో 149 పనులకు గాను రూ.14.90 కోట్లు మేరకు ప్రతిపాదనలు చేశారు. ఈ మండలంలో 37 జగనన్న లేఅవుట్లలో 878 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఆయా కాలనీల్లో సైతం పల్లె పండగ రోడ్లు కనిపించడం లేదు.
- నందిగాం మండలంలో 305 పనులకు గాను రూ.14.37 కోట్లు మేరకు ప్రతిపాదనలు చేశారు. ఇదే మండలంలో 30 జగనన్న లేఅవుట్లలో 1,369 మంది ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇక్కడ సైతం సిమెంట్ రోడ్లు వేయకపోవడం కనిపిస్తోంది.
- సంతబొమ్మాళి మండలంలో 171 పనులకు గాను రూ.15.00 కోట్ల మేరకు ప్రతిపాదనలతో సిమెంట్ రోడ్లు, ఇతర పనులు చేస్తున్నారు. ఇదే మండలంలో గత ప్రభుత్వంలో 30 జగనన్న లేఅవుట్లలో సుమారు 531 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఆయా కాలనీల్లో సైతం పల్లె పండగ రోడ్లు వేయకపోవడం వివక్షత కనిపిస్తోంది.

ఇబ్బందులు పడుతున్నాం



గత ప్రభుత్వంలో ఇంటి స్థలం ఇవ్వడంతో ఇంటి నిర్మాణం చేసుకున్నాం. అయితే సిమెంట్ రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు పడే సమయాల్లో రాకపోకలకు తీవ్ర అవస్థలకు గురవుతున్నాం.

– ఎస్.రవి, జగనన్న కాలనీ, టెక్కలి

ఇబ్బందులు లేకుండా చూడాలి



మా కాలనీలో సిమెంట్ రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పైపు లైన్లు పాడైపోవడంతో ఆ నీరంతా రోడ్డుపై చేరడంతో చిన్నపిల్లలు, స్కూల్‌కి వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు వేసి మాకు అవస్థలు లేకుండా చూడాలి.

– ఎ.లలిత, జగనన్న కాలనీ, టెక్కలి

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు

కవిటి: మండలంలోని జాలారిపాలెం రైతు ఎస్.ప్రసాద్‌కు చెందిన ఆవు బుధవారం సాయంత్రం మేత కోసం వెళ్లి విద్యుత్ షాక్‌తో దుర్మరణం పాలయ్యింది. కవిటి కృష్ణ మందిరం సమీపంలో విద్యుత్ స్తంభానికి వేసిన స్టే వైర్ ఆవుకాలికి తగలడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఈ ఘటన చూసిన రైతు ప్రసాద్ ఆవును కాపాడే ప్రయత్నం చేశాడు. ఈ సమయంలో పరిస్థితిని ఊహించిన సమీపంలోని రైతులు పరుగున వచ్చి ప్రసాద్ ఆవును రక్షించేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. లేకుంటే ఈ ఘటనలో ప్రసాద్ కూడా ప్రాణాలమీదకు తెచ్చుకునేవాడని తోటి రైతులు చెప్పారు. వాస్తవానికి ఇటీవల వరికోతల సమయంలోనే వరిచేను మోస్తున్న మహిళలు షాక్ వస్తుందని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా వారి నుంచి స్పందన కరువడిందని ఆరోపించారు. విషయం తెలుసుకున్న సిబ్బంది వచ్చి స్టేవైర్‌కు సప్లయ్ రాకుండా విద్యుత్ ఆపడంతో ఆవును తప్పించారు. ఈ ఆవును రూ.45,000లకు రైతు కొనుగోలు చేశాడు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందజేయాలని రైతులు కోరారు.

స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న ఎంఈవో లక్ష్మణరావు

కాశీబుగ్గ: మందస మండలం డాబార్‌సింగ్ గ్రామంలో 50 మంది గిరిజన విద్యార్థులకు వసతి గృహ సదుపాయం మంజూరైందని, దీనికోసం స్థల పరిశీలన చేశామని మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ రావు అన్నారు. గ్రామంలో వసతి గృహం ఏర్పాటుకు గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 1.20 ఎకరాల స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ నాయాయ మహా అభియాన్‌లో భాగంగా 50 మంది విద్యార్థులు ఉండేందుకు వీలుగా రూ.2.30 కోట్లతో భవన సముదాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష సైట్ ఇంజినీర్ జనార్ధన పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లిలో సర్పంచ్ దువ్వాడ పద్మావతి ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో పలు కూడళ్లు, రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పనులను మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మధు తదితరులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న పురాతన వస్తు ప్రదర్శన

పలాస:

మండలంలోని రామకృష్ణాపురం శ్రీసత్య సాయి విద్యావిహార్‌లో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఉద్దానం రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన పురాతన వస్తు ప్రదర్శన విశేషంగా ఆకర్షించింది. ప్రదర్శనను సామాజిక సేవకుడు, విద్యావేత్త జి.లింగరాజు, స్కూలు ప్రిన్సిపాల్ బి.ప్రీతి చౌదరి, కరస్పాండెంట్ మల్లా రామేశ్వరరావు ప్రారంభించారు. ప్రదర్శనలో సాంప్రదాయ పనిముట్లుతో పాటు పురాతన కాలానికి చెందిన వందలాది దేశ విదేశీ నాణేలను ప్రదర్శించారు. గ్రామ్‌ఫోన్, రికార్డు ప్లేయర్స్, టేప్ రికార్డర్స్, క్యాసెట్ ప్లేయర్స్, రేడియోలు, టెలిఫోన్లు, కిరోసిన్ దీపాలు, పెట్రోమాక్సు లైట్లు ఆకర్షించాయి. కార్యక్రమంలో కుత్తుం లక్ష్మణ్‌కుమార్, ఉరసం సంఘం అధ్యక్షుడు కుత్తుం వినోద్, పోతనపల్లి వేంకటేష్, కోయిల కోటేశ్వరరావు, కుత్తుం రోజారాణి, కుత్తుం లలిత, బత్తిన వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పురాతన వస్తు ప్రదర్శన ప్రారంభిస్తున్న దృశ్యం

సంకల్పంతో విజయం సాధ్యం

కాశీబుగ్గ: విద్యార్థులు సంకల్పంతో శ్రమిస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలరని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డీవీఈవో) ఎస్.తవిటి నాయుడు అన్నారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రణాళికా బద్ధమైన బోధనతో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి, ఏజీఎంసీ బాడ వెంకటమోహన్, గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకుడు పి.చిరంజీవులు, ఎన్ఎస్ఎస్ అధికారులు కొండల మధుబాబు, తమ్మినాన వాసుదేవరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఇంటర్ విద్యార్థులు చక్కటి ప్రణాళికతో ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి తవిటి నాయుడు అన్నారు. మండలంలోని గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం సందర్శించారు. ఆయనతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న డీవీఈవో తవిటినాయుడు

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కాశీబుగ్గ: బాలల రక్షణ కోసం నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాల నిర్వహణకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా బాలల రక్షణ అధికారి కేవీ రమణ, పలాస ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీహోయూ కె.పార్వతి అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ప్రభుత్వ బాల సదనాన్ని జిల్లా బాలల రక్షణ తనిఖీ బృందం అధికారులు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో బాలసదనం సూపరింటెండెంట్ యు.లత, అధికారులు యం.మల్లేశ్వరరావు, ప్రొటెక్షన్ ఆఫీసర్ లక్ష్మీనాయుడు, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లింగాల శాంతికుమారి, సుధావాణి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి

ఇచ్ఛాపురం: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి సాధిస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో రూ.6 లక్షలతో నిర్మించిన కిచెన్ షెడ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 1961లో మున్సిపల్ బాలికోన్నత పాఠశాలకు స్థలాన్ని దానం చేసిన దాత కాదా లక్ష్మీకాంతమ్మ వారసుడు డాక్టర్ మన్మథరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తనవంతుగా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, పాఠశాల హెచ్ఎం రవణమ్మ, దాసరి రాజు, బచ్చు జగన్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కిచెన్ షెడ్ ప్రారంభిస్తున్న దృశ్యం

సరదాల సంక్రాంతి

- పాఠశాలల్లో ముందస్తు వేడుకలు


ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం ఉన్నత పాఠశాలలో వేడుకలు


ఇచ్ఛాపురం: పురుషోత్తపురం మున్సిపల్ స్కూల్‌లో...


కాశీబుగ్గ: ఉదయపురం యూపీ స్కూల్‌లో...


కంచిలి: ఎక్కల పాఠశాలలో...


సోంపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...


టెక్కలి: ఎంజేపీ పాఠశాలలో...


వజ్రపుకొత్తూరు: సాయివినీత్ విద్యాసంస్థలో చిన్నారులపై భోగిపండ్లు వేస్తున్న దృశ్యం


వజ్రపుకొత్తూరు: వివేకానంద- భారతీ విద్యాసంస్థలో భోగిమంట వేసిన దృశ్యం


పలాస: బ్రాహ్మణతర్లా జెడ్పీ హైస్కూల్‌లో...


ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...


ఇచ్ఛాపురం: పంజావీధి మున్సిపల్ స్కూల్‌లో...


వజ్రపుకొత్తూరు రూరల్: పెదవంక పాఠశాలలో..


కవిటి: కొత్తూరు బీవీకే పాఠశాలలో..


సంతబొమ్మాళి: దండుగోపాలపురం పాఠశాలలో...


కవిటి: ముత్యాలపేట జెడ్పీ స్కూల్‌లో...